# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రభుత్వ ఆసుపత్రులను దేశంలోనే ఉత్తమ ఆసుపత్రులుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.

- క్షమాభిక్ష కింద ఖైదీల విడుదలకు అధికారులతో చర్చిస్తామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.

- రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ప్రారంభానికి సర్వం సిద్ధం చేసినట్లు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ ఆసుపత్రులను దేశంలోనే ఉత్తమ ఆసుపత్రులుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈరోజు అమరావతిలో వైద్య ఆరోగ్య శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖలో 2014-19 మధ్య అమలు చేసిన ఉత్తమ విధానాలను మళ్లీ ప్రవేశపెట్టాలని తెలిపారు. పేదలకు అందుబాటులో ఉండేలా అన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో వైద్య పరికరాలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో టీబీ రోగులు సంఖ్యపై సమగ్ర అధ్యయనం చేసి వారికి నిరంతరం మందులను అందించాలని తెలిపారు. టెలీ మెడిసిన్ పై ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలు అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఈరోజు విజయవాడలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ (శాప్)లో అక్రమాలపై విచారణ చేపడతామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు క్రికెట్ ఐపీఎల్ టీం తీసుకు రావాలని ప్రతిపాదన ఉందని..

ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. క్రీడాకారులకు క్రీడాప్రోత్సాహకాలను అందించడం ద్వారా ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొంటూ....

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ప్రారంభానికి సర్వం సిద్ధం చేసినట్లు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈరోజు అమరావతిలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... తొలి విడతలో 100 క్యాంటీన్లను అందుబాటులోకి తెసుకువాస్తామన్నారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఆగస్టు 15న సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని తెలియజేశారు. ఆ మరుసటి రోజు (ఆగస్టు 16న) మిగిలిన 99 క్యాంటీన్లను మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారని నారాయణ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

క్షమాభిక్ష కింద ఆగస్టు 15వ తేదీన ఖైదీల విడుదల ఉండదని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రి కేంద్ర కారాగారంలో వసతి, సౌకర్యాలను పరిశీలించిన మంత్రి జైళ్లలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. గాంధీ జయంతి రోజున ఖైదీల విడుదల విషయంలో  అధికారులతో చర్చిస్తామని తెలిపారు. సెంట్రల్ జైల్లో "డీ అడిక్షన్" సెంటర్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను పరిశీలిస్తామని మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ లో పంచాయతీలకు స్వాతంత్య్ర దినోత్సవం బడ్జెటన్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్  హర్షం వ్యక్తం చేశారు. 34 సంవత్సరాల తర్వాత మైనర్, మేజర్ పంచాయతీలకు స్వాతంత్య్ర దినోత్సవం, గణతంత్ర వేడుకల బడ్జెట్‌ను 100 రూపాయలు, 250 నుంచి 10 వేల రూపాయల, 25 వేల రూపాయలకు పెంచారన్నారు. దీనితో ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన ఆంధ్రప్రదేశ్ పంచాయతీలకు సాధికారత కల్పించేందుకు కీలక అడుగు పడిందని సామాజిక మాధ్యమం వేదికగా పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఆగష్టు 9 నుంచి 15వ తేదీ వరకు చేపట్టిన "హర్ ఘర్ తిరంగా" ఉద్యమంలో ప్రతి పౌరుడు జాతీయ జెండాను ఎగురవేసి దేశం పట్ల తన భక్తిని చాటాలని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద జాతీయ జెండాను పట్టుకుని ఉద్యమంలో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏలూరులో రైతులకు ధాన్యం బకాయిల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం రైతులకు చెల్లించని 1,674 కోట్ల రూపాయల ధాన్యం బకాయిలను విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పటికే వెయ్యి కోట్ల రూపాయలు విడుదల చేశామని.. మిగిలిన 674 కోట్ల రూపాయలు అందజేస్తున్నట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్

సీజన్ నుంచి 48 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు వేస్తామని మంత్రి తెలిపారు. నష్టపోయిన కౌలు రైతులను ఆదుకుంటామని, ధాన్యం కొనుగోలు విషయంలో ఏమాత్రం వెనుకాడబోమని మంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యువతపై మాదకద్రవ్యాల ప్రభావం పడకుండా వాటి నియంత్రణే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈరోజు స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో "నషా ముక్త్ భారత్ అభియాన్" (NMBA) కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, అవగాహన కార్యక్రమాలును చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ... దేశ అభివృద్ధిని ప్రగతిని ముందుకు తీసుకెళ్లవలసింది యువత మాత్రమేనని స్పష్టం చేశారు. వీటి వినియోగం వలన సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయని, కనుక వాటికి దూరంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగి  నషా ముక్త్ భారత్ అభియాన్ (NMBA) ప్రతిజ్ఞ కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొని మాట్లాడుతూ... యువత మత్తు పదార్ధాలకు బానిస కాకూడదని, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమల ఘాట్ రోడ్లలో వన్యప్రాణులు తిరుగుతున్న నేపథ్యంలో ఆ మార్గంలో ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆంక్షలు విధించింది. ఈరోజు నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు ద్విచక్ర వాహనాలపై వెళ్ళే వారు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే వెళ్ళాల్సి ఉంటుంది. రాత్రి 9 గంటల తర్వాత ద్విచక్ర వాహనాలను ఘాట్ రోడ్లలోకి అనుమతించేది లేదని టీటీడీ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. వివిధ ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాల ద్వారా వచ్చే భక్తులు ఈ మార్పును గమనించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలో ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండల అధ్యక్షురాలు వీరవల్లి దుర్గాభవానికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఆమె ఆకాశవాణితో మాట్లాడుతూ... ఈ వేడుకలకు తనకు ఆహ్వానించడం పట్ల ఆనందం వ్యక్యం చేశారు. ఆజాది కా అమృత్ మహోత్సవాలలో భాగంగా వీరవాసరం మండలంలో పలు గ్రామాల్లోని మంచినీటి చెరువులను అమృత సరోవర పథకంలో అభివృద్ధి చేసి ఇంటింటికి మంచినీళ్లు సరఫరా చేస్తున్నామని అన్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఒక ఎంపీపీకి ఢిల్లీ వేడుకలకు ఆహ్వానం పంపడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నం స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల్లో వైఎస్ ఆర్ కాంగ్రెస్స్ పార్టీ తరపున బొత్స సత్యనారాయణ పోటీ చేయనున్నారు. దీనికి సంబందించి ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఎన్నికలలో విజయం సాధించేందుకు తమ పార్టీకి 530 పైగా సంఖ్య బలం ఉందని, ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికలు జరుగుతాయని కోరుకుంటునట్లు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలతో పాటు, సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో రాయలసీమ నుంచి కొమోరిన్ ప్రాంతం వరకూ ద్రోణి ఆవరించి ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

============================